క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ద్విచక్ర వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్‌

ఆమనగల్లు: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్‌ హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం ఎస్‌ఐ వెంకటేశ్‌ ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనాలను నడిపిన, మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా హెల్మెట్‌ ధరించాలని సూచించారు. ట్రాఫిక్‌ నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: గ్రామాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందుగుల గ్రామంలో బీటీ రోడ్లు, అండర్‌ డ్రైనేజీ, వంతెన నిర్మాణానికి కావాల్సిన నిధులు, అలాగే స్థానిక మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. దీనికి అవసరమైన నిధులు కేటయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో డైరెక్టర్‌ జగన్‌, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, పాండుగౌడ్‌, ప్రకాష్‌రెడ్డి, అశోక్‌, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం: కమిషనర్‌



ఇంటిముందు నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

ఆమనగల్లు: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమనగల్లు మున్సిపల్‌ కమిషనర్‌ వసంత కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తండాలో శుక్రవారం ఫ్రైడే–డ్రై డే కార్యక్రమంలో భాగంగా కమిషనర్‌ వసంత, కౌన్సిలర్‌ కృష్ణనాయక్‌ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పలు ఇళ్ల ముందు నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. తండాకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు.

ప్రార్థన మందిరానికి స్థలం కేటాయించండి



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తుర్కయంజాల్‌: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని సర్వే నంబర్‌ 247లోని 1.27 ఎకరాల వక్ఫ్‌ బోర్డు భూమిని ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి కేటాయించాలని కాంగ్రెస్‌ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండి.గౌస్‌ పాషా కోరారు. శుక్రవారం ఈ మేరకు సదరు భూమిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి ప్రార్థనకు భూమినివ్వాలని కోరారు.

నియామకం

మహేశ్వరం: మహేశ్వరం సబ్‌ రిజిస్ట్రార్‌గా జె శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నారాపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టగా, కార్యాలయ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పనులు పూర్తయి.. ప్రారంభానికి సిద్ధమై

- మండల కేంద్రంలో తహసీల్దార్‌ కార్యాలయ భవనం
- ఎనిమిదేళ్లుగా పాల కేంద్రంలోనే పాలన



పూర్తయిన తహసీల్‌ కార్యాలయం

కడ్తాల్‌: రెండున్నర ఏళ్ల క్రితం మండల కేంద్రంలో శంకుస్థాపన చేసిన తహసీల్దార్‌ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. 2016 అక్టోబర్‌లో కడ్తాల్‌ మండలంగా అవతరించిన నాటి నుంచి తహసీల్దార్‌ కార్యాలయం స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలోని రైతు భవనంలో నిర్వహిస్తున్నారు. భూ సమస్యలు అధికంగా ఉన్న మండలం కావడంతో పాటు, తహసీల్దార్‌ కార్యాలయం చిన్నదిగా ఉండటంతో రైతులు అనేక ఇబ్బందు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు తరచూ కార్యాలయానికి వస్తుంటారు. అక్కడ వారికి ఎలాంటి సౌకర్యాలు లేవు. సమీపంలో చెట్ల కింద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శలు వెల్లువెత్తడంతో 2021లో అప్పటి ప్రభుత్వం తహసీల్దార్‌ కార్యాలయ నిర్మాణానికి రూ.68 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేసింది.

రెండున్నరేళ్లుగా పనులు

2021 డిసెంబర్‌లో అప్పటి ప్రజాప్రతినిధులు, నాయకులు తహసీల్దార్‌ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల మేరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ నిధులు సరిపోకపోవడంతో, మధ్యలోనే వదిలేశారు. స్థానిక నాయకుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం అసంపూర్తి కార్యాలయ నిర్మాణ పనులకు మరో రూ.50 లక్షలు మంజూరు చేసింది. 90 శాతానికి పైగా భవన నిర్మాణ పనులు పూరయ్యాయి. నిధుల విడుదలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు, సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మరో పక్షం రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

తీరనున్న సమస్య

తహసీల్దార్‌ కార్యాలయ భవనం త్వరగా ప్రారంభిస్తే సమస్యలు తీరుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్‌ కార్యాలయంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, నూతన భవనం త్వరగా ప్రారంభిస్తే, మండల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, అధికారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు త్వరగా పనులు పూర్తి చేసి, భవనాన్ని అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు..

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న కమిషనర్‌ రవీంద్రసాగర్‌



ఇబ్రహీంపట్నం రూరల్‌: మాట్లాడుతున్న చైర్మన్‌ నిరంజన్‌రెడ్డి

- 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమానికి అధికారుల ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం: 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కప్పరి స్రవంతి, కమిషనర్‌ రవీంద్రసాగర్‌ కోరారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్‌ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కింద చెత్తాచెదారం తొలగించడం, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడం, మొక్కలు నాటడం, సీజనల్‌ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టడం, మంచినీటి పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్‌ వ్యాధుల నివారణకు చర్యలు

ఇబ్రహీంపట్నం రూరల్‌: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్‌ మర్రి నిరంజన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో చెత్తాచెదారం లేకుండా చేయలన్నారు. మొక్కలు నాటడం, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సీజనల్‌ వ్యాధుల పట్ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వార్డు కౌన్సిలర్లు, అధికారులు తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్‌ బాలకృష్ణ, మున్సిపల్‌ ఇంజనీర్‌ వీరాంజనేయులు, మేనేజర్‌ రమేష్‌, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలు శిశువుకు శ్రేయస్కరం



కడ్తాల్‌: వారోత్సవాల ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు

తలకొండపల్లి: తల్లి పాలు శిశువుకు సంపూర్ణ పౌష్టికాహారం అని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ తిరుమల అన్నారు. తల్లి పాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్‌ అంగన్‌వాడీ కేంద్రం–2లో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్‌ మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో చురుకుగా ఉంటాడన్నారు. అదేవిధంగా మాదాయిపల్లిలో తల్లి పాల వారోత్సవాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్‌ నశ్రీన్‌ బేగం, భూషణమ్మ, వసంత లక్ష్మి, ఏఎన్‌ఎం సుజాత, ఆశ వర్కర్‌ కవిత, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకు అమ్మపాలు

కడ్తాల్‌: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సరళాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ముద్విన్‌ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ.. బిడ్డపుట్టిన గంటలోపే తల్లి పాలు ప్రారంభించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సునీత, కిష్టమ్మ, హంస, ఆశ కార్యకర్త పద్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: వైట్‌ గోల్డ్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇబ్రహీంపట్నం ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆక్టోపస్‌, ఎన్‌ఎస్‌జీ, వైట్‌ గోల్డ్‌ ఇండస్ట్రీస్‌, వినోభానగర్‌, నాగన్‌పల్లి గ్రామాల పరిధిలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి

మంచాల: కేబినెట్‌ సబ్‌ కమిటీ 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని తపస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్య వ్యవస్థలో మార్పు కోసం కార్యక్రమాలు తీసుకోవడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులుకు బదిలీలు, పదోన్నతలు కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. 317 జీఓ కారణంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం కేబినేట్‌ సబ్‌ కమిటీ ముందుకు పోవాలన్నారు. ఈ జీఓ కారణంగా కుటుంబాలకు దూరంగా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

భారత రాజ్యాంగ రక్షణే ధ్యేయం

మీర్‌పేట: భీమ్‌ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధి గాయత్రినగర్‌లో సంస్థ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌ కొంగరి అశోక్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్‌ ఆర్మీ వ్యవస్థాపకులు పీ.వై.గిరి మహరాజ్‌ మాట్లాడుతూ.. బీ.ఆర్‌.అంబేడ్కర్‌ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా సంస్థను స్థాపించామని తెలిపారు. దీంతో పాటు భారత రాజ్యాంగ రక్షణే ప్రధాన లక్ష్యమని వివరించారు.

ఈ నెల 6న ఫొటో గ్రాఫర్ల సమ్మేళనం



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

కడ్తాల్‌: శంషాబాద్‌ పట్టణంలో ఈనెల 6న జరగనున్న ఫొటో అండ్‌ వీడియో గ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నలుమూలల నుంచి ఫొటో, వీడియో గ్రాఫర్లు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్‌ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఫొటో గ్రాఫర్లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 1,500 మంది ఛాయాచిత్రకారులతో సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీశైలం, రబ్బానీ, భీష్మాచారి, కిరణ్‌, శివ, నదీమ్‌, మహేశ్‌, కృష్ణ, సాయి,బనవీన్‌, శంకర్‌ తదితరులు ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: అర్హులైన రైతులు రైతుబీమా కోసం ఈనెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె, ఏఈఓ రాణి రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. కొత్తగా పట్టా పాసుపుస్తకాలు మంజూరైన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఈ నెల 5లోపు..

కడ్తాల్‌: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులతో పాటు, ఇప్పటి వరకు రైతు బీమాకు పొందని అన్నదాతులు ఈనెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఓ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా రైతుబీమాకు 28 జూన్‌ 2024 వరకు పాసుబుక్‌లు పొంది ఉండి 18 నుంచి 59 ఏళ్ల వయసు గల వారు అర్హులని తెలిపారు. రైతుబీమా దరఖాస్తు చేసుకోవడానికి పట్టాదారు పాస్‌బుక్‌ జిరాక్స్‌, రైతు ఆధార్‌కార్డు, రైతు నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌ పత్రాలు జత చేసి వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి అందజేయాలని కోరారు.

పంటల పరిశీలన

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన వానాకాలం పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన పత్తి, జొన్న, మొక్కజొన్న, వరి పంటలను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. సస్యరక్షణ చర్యలలో భాగంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు సాగుచేసి అధిక దిగుబడులు పొందాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు.

మాజీ సర్పంచుల అరెస్టు అక్రమం

- జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ



ఆమనగల్లు: ఆందోళన చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పెండింగ్‌ బిల్లులను చెల్లించాలని హైదరాబాద్‌లో సచివాలయం ఎదుట ధర్నాకు వెళ్తున్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ ఆరోపించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు సోన శ్రీనునాయక్‌, కడారి మల్లమ్మ, లక్ష్మణ్‌నాయక్‌ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. దీంతో పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఉన్న వారికి శుక్రవారం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తున్నామని చెబుతూ నియంత పాలన సాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు దోనాదుల కుమార్‌, పంతునాయక్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పత్యనాయక్‌, నిరంజన్‌గౌడ్‌, బాలస్వామి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్‌, రమేశ్‌నాయక్‌, యాదయ్య, అల్లాజీ, భాస్కర్‌, ఆనంద్‌, జంగయ్య, రాము, సోమ్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీలు

కడ్తాల్‌: మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్ట్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. పెండింగ్‌ బకాయిలు విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం వద్ద నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్‌, హరిచంద్‌నాయక్‌, భూనాథ్‌, సాయిలు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్‌ చేయడాన్ని ఖండిస్తూ పోలీసు స్టేషన్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కందుకూరు: ఇళ్ల సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు స్థలం చూపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్‌, కమిటీ సభ్యుడు అంకగళ్ల కుమార్‌ మాట్లాడుతూ.. 16 సంవత్సరాల క్రితం కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్‌ 778లో 200 మందికి 60 గజాల చొప్పున కేటాయించేలా ఇళ్ల సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వం మరోసారి కేసీఆర్‌ బొమ్మతో సర్టిఫికెట్లను ఇచ్చిందన్నారు. ఇంత వరకు స్థలాన్ని చూపలేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తూ హద్దు రాళ్లు పాతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌, శేఖర్‌, యాదయ్య, ఇంద్రమ్మ, యాదమ్మ, మంజుల, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ నాయకుల సంబురాలు



అబ్దుల్లాపూర్‌మెట్‌: గౌరెల్లిలో సంబురాలు నిర్వహించిన అంబేడ్కర్‌ యూత్‌ సభ్యులు



ఆమనగల్లు: అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్‌ శ్రేణులు



మంచాల: ఆరుట్లలో అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జాతీయ రహదారిపై రాజీవ్‌ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్‌ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్‌ బీ.ఆర్‌.అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వెంటనే అమలు చేయాలి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్‌ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్‌ డిమాండ్‌ చేశారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

మంచాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్‌ నాయకులు అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామంలో నాయకులు అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేశారు.

మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

కడ్తాల్‌: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పునివ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్‌ నాయకులు పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

లబ్ధిదారుల హర్షాతిరేకాలు

- రెండో విడత రైతు రుణమాఫీపై అన్నదాతల ఆనందం
- మండలంలో రూ.39.82 కోట్లు మాఫీ



వరి నారుతో పంట పొలం

తలకొండపల్లి: ప్రభుత్వం అమలు చేసిన రెండో విడత రుణమాఫీతో అన్నదాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. పంట పెట్టుబడికి తీసుకున్న రుణాలకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు. 2018 డిసెంబర్‌ 12 నుంచి 2023 డిసెంబర్‌ 9 వరకు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు పూనుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు రూ.రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ ఏక కాలంలో ఈ నెల 15 లోగా చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు ప్రభుత్వం కసరత్తు చేపట్టి రుణమాఫీ మార్గదర్శకాలను జారీ చేసింది.

5,520 మంది రైతులకు లబ్ధి

భూమి ఉన్న ప్రతి కుటుంబానికి రూ.రెండు లక్షల వరకు మాఫీ వర్తిస్తుంది. పాస్‌బుక్‌ ఆధారంగానే రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ఎవరి పేరిట రుణం ఉందనే వివరాలు పరిశీలించి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుంది. మూడు విడతల వారీగా రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జులై నెల 18న రూ.లక్ష వరకు ఉన్న పంట రుణమాఫీ చేయగా, రూ.లక్షన్నర జులై నెలఖారులోపు, రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేయనున్నారు. తలకొండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులకు మొదటి విడతలో రూ.లక్ష రుణమాఫీకి 3,853 మంది రైతులకు రూ.23.31 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. రెండో విడతలో 1,667 మంది రైతులకు రూ.16.51 కోట్లు జమ అయ్యాయని మండల ఏఓ రాజు ప్రకటించారు.

రుణపడి ఉంటాం



సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షన్నర రైతు రుణమాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. నా తండ్రి రూ.63 వేలు, నేను రూ. 82 వేలు బ్యాంక్‌లో రుణం తీసుకున్నాం. మా ఇంట్లో రూ.1.45 లక్షలు రుణమాఫీ అయింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– నూకం శేఖర్‌, రైతు, తలకొండపల్లి

రైతులకు మేలు



పంట రుణమాఫీతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయడంతో అందరూ సంతోషంగా ఉన్నారు. రుణమాఫీతో రైతులకు మేలు జరిగి వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్లే అవసరం ఉండదు. రైతులు ఆర్థికంగా ఎదిగడానికి ఉపయోగ పడుతుంది.

– రేణురెడ్డి, రైతు నాయకుడు, గట్టుఇప్పలపల్లి